# 'పురం'లో వైఎస్సార్‌సీపీ గెలుపు తథ్యం




మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్, చిత్రంలో వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థులు శాంతమ్మ, దీపిక, సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- ఎన్నిపార్టీలు, ఎన్నిజెండాలు జతకట్టినా జగన్ ప్రభంజనాన్ని ఆపలేవు
- 30న జరిగే బస్సుయాత్రను జయపద్రం చేయాలి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్

**హిందూపురం:** సార్వత్రిక ఎన్నికల్లో హిందూపురంలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడం తథ్యమని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ అన్నారు. హిందూపురం పట్టణంలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తల సమావేశం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి నవీన్ నిశ్చల్ తో పాటు హిందూపురం అసెంబ్లీ అభ్యర్థి కురుబ దీపిక, పార్లమెంట్ అభ్యర్థి బోయ శాంతమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి, చౌళూరు మధుమతిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ, వైస్ చైర్మన్ బలరామిరెడ్డి తదితరులు హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్‌నిశ్చల్ మాట్లాడుతూ పార్లంట్ స్థానంతో పాటు హిందూపురం అసెంబ్లీ స్థానం గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ శ్రేణులు కలసికట్టుగా పనిచేయాలన్నారు. ఐక్యత లేకపోవడంతో ఇన్నాళ్లూ టీడీపీ దెబ్బతిస్తూ వచ్చింది తప్ప టీడీపీ బలం కానే కాదన్నారు. ఇక్కడ కంచు లేదు గాజు పెంకు లేదన్నారు. ఇప్పుడు అదిరిపోయేలా దెబ్బకొట్టే సమయం వచ్చిందన్నారు. ఈసారి వైఎస్సార్‌సీపీ నాయకులందరూ కలిసికట్టుగా బరిలోకి దిగుతున్నామని, వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయడమే తమ ధ్యేయమన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి హిందూపురం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ గెలుపొందాలనే దృఢ సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ఈసారి వైఎస్సార్‌సీపీ గెలుపుతో పురం దశ దిశ మారడం ఖాయమన్నారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో 30వ తేదీన హిందూపురానికి బస్సుయాత్ర ప్రారంభమవుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి యాత్రను విజయవంతం చేయాలని కోరారు. 21వ తేదీ నుంచి ప్రతి వార్డు, ప్రతి పంచాయతీలకు వెళ్లి అందరినీ ఒకేతాటిపై తీసుకువస్తామన్నారు. అందరూ ఏకతాటిపై నిలిచి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుంటామని చెప్పారు.

### కలసికట్టుగా పనిచేద్దాం

వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ పార్టీ పరిశీలకులు రాజారెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, చౌళూరు మధుమతి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజలు మాట్లాడుతూ కలసికట్టుగా పనిచేసి వైఎస్సార్‌సీపీ గెలుపుకు కృషి చేద్దామన్నారు. ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్ జగన్‌కే ప్రజల మద్దతు ఉందన్నారు. సమావేశంలో కార్పొరేషన్ డైరెక్టర్లు జనార్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఉదయించే సూర్యుడు జగనన్న



హిందూపురం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కురుబ దీపిక మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే మహిళలకు తగిన గౌరవం దక్కుతోందన్నారు. గత టీడీపీ పాలనలో చేసిన అవినీతి, అక్రమాలు, నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలకు వ్యత్యాసాన్ని ప్రజలకు అర్థమయ్యే వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజలకు తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసే విధంగా చైతన్య పర్చాలన్నారు. తూర్పున సూర్యుడు ఉదయించేది ఎంత నిజమో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయ్యేది అంతే నిజమన్నారు. వంద పార్టీలు వంద జెండాలు జతకట్టి వచ్చినా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనాన్ని ఆపలేరన్నారు.

## సంక్షేమాభివృద్ధి జగన్‌తోనే సాధ్యం



వైఎస్సార్‌సీపీ హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ, టీడీపీ ,జనసేన ఏకమైనప్పటికీ సింహం లాంటి జగనన్న సింగిల్‌గానే వస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ కచ్చితంగా విజయం సాధిస్తుందని, రెండోసారి జగనన్న సీఎంగా బాధ్యతలు చేపడతారని పేర్కొన్నారు. కుల మతాల మధ్య చిచ్చుపెట్టే బీజేపీ, అవసరాన్ని బట్టి రంగులు మార్చే ఊసరవెల్లి చంద్రబాబును ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఆ రెండు పార్టీలకు ఎప్పుడూ వత్తాసు పలికే జనసేనపై కూడా ప్రజల్లో నమ్మకం లేదన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని అందరి మనస్సులో ఉందన్నారు. అందరూ సమష్టిగా హిందూపురం అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలను గెలిచి జగనన్నకు బహుమతిగా ఇద్దామని సూచించారు.

# వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలి



మాట్లాడుతున్న మడకశిర నియోజకవర్గ అభ్యర్థి ఈరలక్కప్ప

**అమరాపురం:** వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప కోరారు. బుధవారం మండలంలోని గొల్లమారనహల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో అందరం కలసికట్టుగా పని చేసి భారీ మెజార్టీతో తనను గెలిపించాలన్నారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి కుటుంబానికి తెలియజేయాలని సూచించారు. అనంతరం అదే గ్రామంలో ఈరన్న ఇంట్లో జరిగిన వివాహ కార్యక్రమంలో ఆయన పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్, రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాంతరాజు, ఎంపీపీ ఈరన్న, నాయకులు చిత్తన్నయాదవ్, పూజారి చిత్తప్ప తదితరులు పాల్గొన్నారు.

# టీడీపీ అభ్యర్థి సవితమ్మకు షాక్



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి ఉషశ్రీచరణ్

- సొంత పంచాయతీలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 20 కుటుంబాల చేరిక

**పెనుకొండ:** పెనుకొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవితమ్మకు ఊహించని షాక్ తగిలింది. మండలంలోని తన సొంత పంచాయతీ రాంపురం నుంచి 20 కుటుంబాలు టీడీపీని వీడి బుధవారం రాత్రి వైఎస్సార్‌సీపీ చేరాయి. పట్టణంలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి మంత్రి ఉషశ్రీచరణ్ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. మరువపల్లికి చెందిన వి. ప్రతాప్, జి. ఓబులేష్, ఈ. శంకర్, జి. రాజు, బి. మారుతి, బి.నరసింహప్ప, శ్రీనాథ్, బి. అనిల్, ఎస్. అంజనేయులు, ఎస్. శ్రీనివాసులు, బి. జయచంద్ర, బి. రామాంజినపేయులు , బి.నరసింహులు, సి.రాజు, పి. నరసింహులు, బి. నాగరాజు, బి. గోపాల్, బి. రామలింగ, వి. అక్కులప్ప, ఎం.లక్ష్మణ్ణ, ఎం .అంజి తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. పెనుకొండలో మంత్రి ఉషశ్రీచరణ్ విజయానికి శక్తి వంచన లేకుండా కృషిచేస్తామని ప్రతాప్, ఓబులేసు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు గోపాలరెడ్డి, నారాయణ, బి. వెంకటేష్, పెద్దంజినేయులు, రాము, చిన్నంజి తదితరులు పాల్గొన్నారు.

# ఆర్డీటీకి నిధులు రాకుండా అడ్డుకోవడం దారుణం



సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తున్న బహుజన చైతన్య వేదిక నాయకులు

**పెనుకొండ:** ఆర్డీటీ సంస్థకు నిధులు రాకుండా కేంద్ర ప్రభుత్వం అడ్డుకోవడం దారుణమని స్థానిక బహుజన చైతన్య వేదిక నాయకులు అన్నారు. వారు విలేకరులతో మాట్లాడుతూ.. కరువు జిల్లా అయిన ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు ఇతర కులాలకు చెందిన నిరుపేదలకు ఎన్నో విధాలుగా ఆర్డీటీ సంస్థ అండగా నిలిచిందన్నారు. ఉన్నతమైన వైద్యాన్ని ఉచితంగా నిరుపేదలకు అందిస్తూ ఎంతో మంది ప్రాణాలను కాపాడుతున్నారన్నారు. అలాగే పేద క్రీడాకారులను ప్రోత్సహిస్తూ వారికి క్రీడల్లో ఉజ్వల భవిష్యత్తు కల్పిస్తోందన్నారు. రాజకీయాలతో సంబంధం లేకుండా పేద ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేస్తున్న ఆర్డీటీకి ఇతర దేశాల నిధులు రాకుండా సంస్థ ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్ చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఆపివేయడం దారుణమన్నారు. వెంటనే సంస్థ ఎఫ్‌సీఏఆర్‌ను రెన్యూవల్ చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం వినతి పత్రం అందించారు. సంస్థ అధ్యక్షుడు శివరామకృష్ణ, వెంకటేసులు, మారుతి, ప్రవీణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## శుభకార్యం



నూతన వధువరులును ఆశీర్వదిస్తున్న మంత్రి ఉషశ్రీచరణ్

**పెనుకొండ రూరల్:** మండలంలోని కురుబవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త చంద్రాయుడు కుమారుడు అశోక్ వివాహ వేడుక బుధవారం పెద్ద చెరువు కట్ట ఆంజనేయస్వామి దేవాలయంలో జరిగింది. మంత్రి ఉషశ్రీచరణ్ వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

**పెనుకొండ:** పట్టణంలోని మడకశిర రోడ్డులో ఉన్న గోల్డెన్ ఎంపైర్ ఫంక్షన్‌హాల్లో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాగలూరుబాబు సోదరుడు వెంకటరామిరెడ్డి కుమార్తె వివాహం ఘనంగా జరిగింది. మంత్రి ఉషశ్రీచరణ్ వివాహ వేడుకలో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు.

# ప్రశాంతంగా పది పరీక్షలు

**చిలమత్తూరు:** మండల కేంద్రంలోని ఎస్ఎస్‌వైవీఎస్ ప్రైవేటు పాఠశాలలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయి. మూడోరోజు ఇంగ్లిష్ పరీక్షకు 498 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 485 మంది హాజరయ్యారని పరీక్షల విభాగం చీఫ్ ఈశ్వర ప్రసాద్ తెలిపారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

**పరిగి:** పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మూడో రోజు బుధవారం మండలంలో ప్రశాంతంగా జరిగాయి. ఇంగ్లిష్ పరీక్ష మొత్తం 4 పరీక్షా కేంద్రాల్లో జరిగింది. 728 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 712 మంది హాజరైనట్లు ఎంఈఓ-2 శేషాచలం తెలిపారు. 16 మంది పరీక్షకు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

**గోరంట్ల:** మండలంలోని ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో బుధవారం జరిగిన ఇంగ్లిష్ పరీక్షకు 1072 మంది హాజరు కావాల్సి ఉండగా 1045 మంది హాజరైనట్లు అధికారులు తెలిపారు. 27 మంది గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

# ఘనంగా కనకదాస విగ్రహావిష్కరణ



కనకదాస విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

**మడకశిరరూరల్:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కురుబల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత కల్పిస్తూ అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి తెలిపారు. హరేసముద్రం పంచాయితీ కేంద్రంలో బుధవారం కురుబ కులస్తుల ఆధ్వర్యంలో ఘనంగా భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కురుబలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగడానికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారని తెలిపారు. పిల్లలను బాగా చదివించి విద్యావంతులు చేయాలని తల్లిదండ్రులను కోరారు. సర్పంచ్ కరియన్న, న్యాయవాది గోవిందప్ప కురుబ కులస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## వైఎస్సార్‌సీపీ యువ నాయకుడి మృతి

**అమరాపురం:** మండల కేంద్రానికి చెందిన వైఎస్సార్‌సీపీ యువకుడు ఓబలేసు (26) బుధవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు హులుకూరు కాంతరాజు, మండల కన్వీనర్ త్రిలోక్‌నాథ్, సీనియర్ నాయకులు పీఆర్.మూర్తి తదితరు ఓబలేసు మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## 'కానిస్టేబుల్ .. మా స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నిస్తున్నారు'

**పెనుకొండ:** పట్టణంలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బాలాజీ, అతని కుటుంబ సభ్యులు వైష్ణవి, సుబ్బమ్మ నుంచి తన స్థలాన్ని కాపాడాలని పట్టణంలోని దర్గాపేట ఇసుక వంక ప్రాంతానికి చెందిన దివ్యాంగురాలు పద్మావతమ్మ అధికారులకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని 219 సర్వే నంబర్‌లో తనకు చెందిన స్థలం 2.68 సెంట్లు ఉండగా ఈ స్థలం తమదేనని కానిస్టేబుల్ కుటుంబం దౌర్జన్యం చేస్తోందన్నారు. ఏకంగా జేసీబీ తెచ్చి స్థలం ఆవరణలోని చెట్లను తొలగించి స్థలం ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారన్నారు. దీనిపై పోలీస్ ఉన్నతాధికారుల వద్దకు న్యాయం కోసం వెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తగిన చర్యలు చేపట్టి న్యాయం చేయాలన్నారు.

## పనితీరు మార్చుకోండి

**రొద్దం:** పనితీరు మార్చుకోవాలని సీఐ యుగేందర్ పోలీసు సిబ్బందిని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను పెనుకొండ సీఐ యుగేందర్ తనఖీ చేశారు. స్టేషన్‌లో పోలీసులు పనితీరు బాగాలేదని, పనితీరు మార్చుకోవాలని సూచించారు.

## జేసీఎస్ కన్వీనర్‌గా విష్ణువర్ధన్‌రెడ్డి

**పరిగి:** మండల జేసీఎస్ కన్వీనర్‌గా కొడిగెనహల్లి పంచాయతీకి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. మంత్రి ఉషశ్రీచరణ్ ఈ మేరకు ఉత్తర్వులను విడుదల చేశారు. తనకు అప్పగించిన బాధ్యతలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

## వ్యక్తికి తీవ్రగాయాలు

**అమరాపురం:** మండలంలోని నిద్రగట్ట గ్రామానికి చెందిన నాగరాజు చింతకాయలను దులపడానికి గుడిబండ మండలం మోరుబాగల్ గ్రామ పొలి మేరలోకి వెళ్లాడు. బుధవారం చింత చెట్టు ఎక్కి కాయలను దులుపుతూ కాలు జారి కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడిన నాగరాజును మడకశిర ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

## వ్యక్తి ఆత్మహత్యాయత్నం

**హిందూపురం అర్బన్:** భార్య కాపురానికి రాలేదని పూలకుంటకు చెందిన మంజునాథ్ స్వగ్రామంలోని ఇంటి వద్ద బుధవారం పెట్రోలు పోసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. వెంటనే స్థానికులు గమనించి మంటలను ఆర్పి 108 ద్వారా హిందూపురం ఆస్పత్రికి తరలించినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన సీఐ

**గోరంట్ల:** స్థానిక పోలీసుస్టేషన్ ప్రాంగణంలో వేసవిని దృష్టిలో ఉంచుకొని పోలీసులు ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం సీఐ సుబ్బరాయుడు చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి ముగిసే వరకు చలివేంద్రం పనిచేస్తుందన్నారు.

## ఉపాధి పనులపై సమీక్ష

**రొద్దం:** మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పథకంపై బుధవారం సమీక్ష నిర్వహించారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో కూలీల సంఖ్య పెంచడానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ప్రతి ఫీల్డ్ అసిస్టెంట్ కూలీల సంఖ్య పెంచడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కేశవ రెడ్డి, ఏపీఓ, ఈసీ, టెక్నిల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## పోషణ్ పక్వాడపై అవగాహన

**పెనుకొండ రూరల్:** మండలంలోని మావటూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. సీడీపీఓ శాంత లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పోషణ్ పక్వాడా కిట్లను బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## క్లుప్తంగా

### రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలు

- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు



రోడ్డు పక్కనే కోళ్ల వ్యర్థాలను పడవేసిన దృశ్యం

**లేపాక్షి:** మండలంలోని పులమతి గ్రామ సమీపంలో ఆర్‌అండ్‌బీ రహదారి పక్కనే ఓ కోళ్ల ఫారం నిర్వహిస్తున్నారు. అయితే కోళ్ల ఫారంలో వివిధ రోగాలతో చనిపోయిన కోళ్లను గుంతలు తీసి మట్టికప్పి పూడ్చలి. అలా చేయకుండా కోళ్ల వ్యర్థాలను హిందూపురం - కంచిసముద్రం రహదారి పక్కనే పడేస్తున్నారు. దీంతో కోళ్ల మాంసం తినేందుకు కుక్కలు పోటీ పడుతుండటంతో పాటు అటు వెళ్లే మనుషులపై కూడా దాడులకు పాల్పడుతున్నాయి. దీంతో ఆ రహదారి వెంట వచ్చి పోయే వివిధ వాహనదారులు ప్రమాదాలకు తరచూ గురవుతున్నారు. కోళ్ల వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిపై హిందూపురం రూరల్ ఈఓఆర్డీ నటరాజ్ దృష్టికి తీసికెళ్లగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి కోళ్ల వ్యర్థాలను పడేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

### 'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

**పావగడ:** పదో తరగతి పరీక్షలు ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 6 వరకూ జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని స్థానిక బీఈఓ ఇంద్రాణి తెలిపారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇంద్రాణి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాలూకా వ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు ఉండేలా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మొత్తం 3156 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల చుట్టూ 200 మీటర్లు ఆంక్షలు విధించామన్నారు.

### పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న గాయత్రిబాయి

**పావగడ:** సీఈటీ, నీట్ పోటీ పరీక్షల ఉచిత కోచింగ్‌ను నిర్లక్ష్యం చేయకుండా కష్టపడి చదివి విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి ట్రస్ట్ నిర్వాహకులు, అధ్యాపకులు, తల్లితండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని తేజస్ చారిటబుల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి గాయత్రిబాయి అన్నారు. స్థానిక తేజస్ మీటింగ్ హాల్‌లో బుధవారం ఉచిత సీఈటీ, నీట్ కోచింగ్‌ను ప్రారంభించారు. దాదాపు నెల పాటు జరిగే శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే సోమ్లానాయక్, కోచింగ్ అధ్యాపకుడు వినోద్ కుమార్, ఎస్ఎస్‌కే శ్రీనివాస్, శంకర మూర్తి, కేశవ చంద్రదాస్ తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యాన ఉత్పత్తుల తయారీపై అవగాహన



ఉద్యాన ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మడకశిరరూరల్:** బోరు బావుల కింద రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి ఆర్థికంగా అభివృద్ధి చెందవచ్చని ప్రభుత్వ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమణ తెలిపారు. ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాల ఎన్ఎస్ఎస్ క్యాంపులో భాగంగా బుధవారం జీవీపాళ్యం గ్రామంలో ఉద్యాన ఉత్పత్తుల తయారీపై అవగాహన కల్పించారు. మిశ్రమ పండ్లుతో జామ్ తయారు చేసి చూపించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఉద్యాన పంటల ఉప ఉత్పత్తులపై అవగాహన పెంచుకుని ఇతరులపై ఆధారపడకుండా ఉపాధి పొందవచ్చన్నారు. నీటి సౌకర్యం ఉన్న రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ఆర్బీకే ఇన్‌చార్జ్ శైలజ, అధ్యాపకురాలు మౌనిక, పీడీ రాజేష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

### వలంటీర్ మృతి



సుగుణ (ఫైల్)

**సోమందేపల్లి:** మండల కేంద్రమైన సోమందేపల్లిలోని సచివాలయం -1లో పనిచేస్తున్న వలంటీర్ సుగుణ (32) క్యాన్సర్‌తో బాధపడుతూ బుధవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆమె పుట్టపర్తిలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సచివాలయ సిబ్బంది మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శించారు.

**పరామర్శ**

మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి ... వలంటీర్ సుగుణ మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ కన్వీనర్ వెంకటరత్నం, జెడ్పీటీసీ అశోక్ ఉన్నారు.

## వైఎస్సార్‌సీపీని గెలిపించండి



మడకశిరలో ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**మడకశిర:** మడకశిర అసెంబ్లీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఈరలక్కప్ప, హిందూపురం పార్లమెంట్ అభ్యర్థి శాంతమ్మను భారీ మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వైసీ గోవర్ధన్‌రెడ్డి ఓటర్లను కోరారు. ఆయన బుధవారం పట్టణంలోని వైఎస్సార్ సర్కిల్ ప్రాంతంలో స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్ జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఆయన ప్రజలకు వివరించారు. మండల కన్వీనర్ రామిరెడ్డి, జెడ్పీటీసీ జమ్మానపల్లి మూర్తి, మాజీ సర్పంచు శ్రీరాములు, ఎంపీటీసీ హనుమంతరాయప్ప తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పెద్దిరెడ్డిపై విమర్శలు మానుకోండి

**మడకశిర:** టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు.. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై విమర్శలు చేయడాన్ని మానుకోవాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. మంత్రిపై అనవసరమైన విమర్శలు చేస్తే సహించబోమని హెచ్చరించారు. చంద్రబాబు రాజకీయ వికలాంగుడని మంత్రి చేసిన విమర్శల్లో తప్పేముందని ప్రశ్నించారు. చంద్రబాబు నిజంగానే రాజకీయ వికలాంగుడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు తన 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఏ రోజు కూడా సింగల్‌గా పోటీ చేసి ఎన్నికల్లో గెలవలేదన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాజకీయ జీవితం తెరచిన పుస్తకమని తెలిపారు. జైలుకెళ్లి వచ్చిన అచ్చెన్నాయుడు... రాజకీయాల్లో విలువలు పాటించే మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ధ్వజమెత్తారు.

## మంత్రిని కలసిన ఎస్టీ సెల్ నాయకులు



మంత్రి ఉషశ్రీచరణ్‌ను కలసిన ఎస్టీసెల్ నాయకులు

**పెనుకొండ:** రాష్ట్ర మంత్రి, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఉషశ్రీచరణ్‌ను వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ నాయకులు బుధవారం మంత్రి స్వగృహంలో కలిసారు. ఇటీవల ఉషశ్రీచరణ్‌ను ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించడంతో ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆల్‌ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు అంజినాయక్, దుంగావత్ రమేష్‌నాయక్, సర్పంచ్ సరోజాబాయి, నాగేనాయక్, నల్లమాడ ఎంపీపీ అంజినాయక్, నల్లమాడ కన్వీనర్ కుళ్లాయినాయక్, వైఎస్సార్‌సీపీ ఎస్టీసెల్ కన్వీనర్ తిరుపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాల తనిఖీ

**మడకశిర:** మండలంలోని ఏర్పాటు చేసిన టెన్త్ పరీక్ష కేంద్రాలను బుధవారం డీఈఓ మీనాక్షి తనిఖీ చేశారు. మడకశిర పట్టణంతో పాటు మండలంలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్ష కేంద్రాలను ఆమె సందర్శించారు. పరీక్ష నిర్వహణపై ఆమె ఆరా తీశారు. పరీక్ష కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలను కూడా అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట స్థానిక ఎంఈఓలు భాస్కర్, నరసింహమూర్తి ఉన్నారు.

## బీచిగానిపల్లిలో కార్డెన్ సెర్చ్



బీచిగానిపల్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, బీఎస్ఎఫ్ సిబ్బంది

**పరిగి:** ఓటు సామాన్యుని వజ్రాయుధమని ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని పెనుకొండ సీఐ యుగంధర్ తెలిపారు. మండలంలోని బీచిగానిపల్లిలో బుధవారం సీఐ నేతృత్వంలో పరిగి, రొద్దం, సోమందేపల్లి ఎస్ఐలు సత్యనారాయణ, వలీబాషా, విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్ఎఫ్ దళాలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.